# ఆత్మధృతి

(1989)

"దయానిధి బాబుగారు తమర్నోమారు ఆళ్ళింటికి రమ్మన్నారు. సాయంత్రం ఇంటిలోనే ఉంటారంట" చెప్పివెళ్ళాడు ప్యూన్ శివయ్య. ఆయన నించి కబురనేసరికి– ఎందుకో ఆశ్చర్యమనిపించింది. తయారు చేస్తున్న స్టేట్ మెంట్ ను ఓ ప్రక్కకు సర్ది ఆలోచనలో పడ్డాను.

గత రెండు రోజులుగా దయానిధి గురించి ఆఫీసులో వివిధ రకాలైన వార్తల్ని వింటున్నానేమో ఏది నమ్మాలో ఏది నమ్మకూడదో తేల్చుకోలేని పరిస్థితిలో ఉన్నాను– ఇప్పుడీ పిలుపు!

నాలుగు రోజులుగా దయానిధి సెలవులో ఉన్నాడు. నేను విశాఖ బ్రాంచికి ట్రాన్స్ఫరై వచ్చాక ఈ రెండేళ్ళలో ఆయన వరుసగా ఇన్ని రోజులు సెలవు పెట్టడం ఇదే ప్రథమం. "వర్క్ యీజ్ వర్షిప్– డ్యూటీ యీజ్ గాడ్" అని నమ్మేవారిలో ఆయనొకడు.

దయానిధికి దాదాపు నలభై యేళ్ళుంటాయి. దబ్బపండు రంగు ఎర్ర ఛాయ. ఆజానుబాహువు. అయినా ఘోటక బ్రహ్మచారి! నాకు తెలిసినంత వరకూ ఆఫీసు విషయాల్లో చాలా స్ట్రిక్ట్‌గా ఉంటాడు. ఉదయం భోజనంచేసి ఆఫీసుకు వస్తూ ఫ్లాస్క్‌తో కాఫీ తెచ్చుకుంటాడు. అంతే! సీటు కదిలి ఎటూ వెళ్ళడు. అందుకే పై వారూ క్రింది వారూ అతనిలోని సిన్సియారిటీని మెచ్చుకుంటూంటారు.

ఆయనతో నాకున్న పరిచయం అంతంతమాత్రమే. నేను కథలు రాస్తానని తెలిసి నాతో పరిచయాన్ని పెంచుకొచ్చాడు. అప్పుడప్పుడూ లంచ్ అవర్లో మా పర్సనల్ యూనిట్ లోకి వచ్చి కాసేపు కథల గురించి నాతో మాట్లాడుతూ ఉంటాడు. నా కథలు పత్రికల్లో వస్తే చదివి వాటిలోని బాగోగుల్ని విడమరిచి చెబుతుంటాడు.

ఆయనకెన్నో ఆలోచనలున్నాయి. మంచి అభిరుచులూ ఉన్నాయి–

జీవితంపట్ల నిశ్చయమైన అభిప్రాయమూ ఉన్నట్లు తోస్తుంది. మిత భాషి అవడంవల్ల చాలా మందికి అతని అంతరంగం అంతగా తెలియదు.

సాయంకాలం నేను దయానిధి ఇంటికి వెళ్ళేసరికి చల్లబడింది. నా కోసమే చూస్తున్నట్లు నన్ను చూసి సాదరంగా ఆహ్వానించాడు. డాబామీద రెండు కుర్చీలు వేశాడు. టీపాయ్‌మీద ఫ్లాస్క్‌తో కాఫీ. రెండు కప్పులూ, ఒక బిస్కెట్ పాకెట్టూ ఉన్నాయి.

డాబామీంచి చూస్తే తూర్పున దూరంగా నీలి సముద్రం, ఉత్తరం వైపు ఆకుపచ్చని కొండ. జన సంచారానికి దూరంగా చక్కని ప్రదేశంలో తనకంటూ ఓ చిన్న ఇల్లు కట్టుకున్నాడు. ఆ ఇంటికి దీపంలా ఓ ఇల్లాలు కూడా ఉండి ఉంటే పరిపూర్ణత లభించేది అనిపించింది.

"మీ కథలు మధ్యతరగతి జీవితాలను ప్రతిబింబిస్తూ వారి సమస్యలకు అద్దం పడతాయి. వాస్తవ చిత్రీకరణలో మంచి నేర్పుంది మీకు. అందుకే మీ కథలు నాకు నచ్చుతాయి" అన్నాడు దయానిధి కాఫీ కప్పు నాకందిస్తూ.

నవ్వి ఊరుకున్నాను.

"ఇన్నాళ్ళ మన పరిచయంలోనూ మన మధ్య ఈ కథల గురించి తప్ప వ్యక్తిగత విషయాల ప్రస్తావన ఎప్పుడూ రాలేదు. కానీ ఈ రోజు నా వ్యక్తిగత విషయాలు కొన్ని మీతో మాట్లాడాలని పిలిచా. మీకు అభ్యంతరం లేకపోతేనే" అంటూ ఆగాడు.

"చెప్పండి" అంటూ ఖాళీచేసిన కాఫీ కప్పును టీపాయ్ మీద వుంచి కుర్చీలో వెనక్కు జారబడ్డాను.

"నేను పెళ్ళి చేసుకోబోతున్నాను. రేపే నా పెళ్ళి" అన్నాడు నెమ్మదిగా.

"నిజమా" అంటూ ఆశ్చర్యంతో ముందుకు వంగాను.

నిజానికి దయానిధి చెప్పేది ముందుగా ఊహించగలిగినా అంత తక్కువ వ్యవధిలో అతని పెళ్ళంటే నమ్మశక్యం కాలేదు.

"మీరంతగా ఆశ్చర్యపోయేందుకు ఇందులో ఏమీ ఉండి ఉండదు. ఈపాటికి మీక్కొంత తెలిసే ఉండాలి" అన్నాడు దయానిధి.

నేనేం మాట్లాడలేదు.

"నా గురించి ఆఫీసులో ఎన్నో వదంతులు లేచాయన్న సంగతి నాకీమధ్యే తెలిసింది. అయితే వదంతులన్నీ ఎప్పుడూ నిజాలుకావు.

పెళ్ళిని గురించి నాకెన్నో అభిప్రాయాలున్నాయి. స్త్రీ పురుష సంబంధం గురించి పవిత్రమైన అభిప్రాయమే ఉంది. అయితే నేనింత వరకూ పెళ్ళి చేసుకోకపోవడానికి సంబంధాలు కుదరకగాని, కట్న కానుకలు చాలకగాని, నాలో పురుషత్వం లేకపోవడం గానీ కారణాలు కావు. పాతికేళ్ళ ఆ వయసులో ఎందుకో పెళ్ళి ఒద్దనుకున్నాను. వయసు పైబడినా ఆ ఉద్దేశ్యంలో మార్పు రాలేదు. కానీ ఇటీవలే నా ఒంటరితనం నన్ను బాధిస్తోంది. ఇప్పుడాలోచిస్తె పెళ్ళనేది జీవితాలకి అవసరమేననిపిస్తోంది. తోడు కోసం ఏర్పరచిన ఆ బంధం బతుకులకు కావలసిందే అనిపిస్తోంది.

కానీ....ఇప్పుడీ వయసులో నేను పెళ్ళికి సుముఖత చూపడం ఏమంత వివేకమైన పని కాదేమో! ఏ కన్యా నన్ను కోరి చేసుకోదు- ఇష్టపడదు- నేను యిష్టపడ్డవారు నన్నూ యిష్టపడాలిగా."

దయానిధిని చేసుకునేదెవరైనా ఒక విధంగా అదృష్టవంతులే అనిపించింది నాకు- వయసు నలభై అన్న మాటేగాని దృఢంగా ఉంటాడు. ఏ వ్యసనాలూలేవు. స్వంత ఇల్లు, బ్యాంకు బేలన్స్, సత్ప్రవర్తనా, నీతి నిజాయితీలు అతని ఆస్తులు.

"మీరీపాటికి ఊహించే ఉండాలి" అంటూ తన కాబోయే శ్రీమతి పేరు చెప్పాడు దయానిధి.

నేనాశ్చర్యంతో నోట మాటలేక ఉండిపోయాను.

"ఆశ్చర్యపోకండి- ఆ మా కథ చెప్పడానికే మిమ్మల్ని పిలిపించింది" అంటూ చెప్పడం మొదలుపెట్టాడు దయానిధి.

0 0 0

ఆ రోజు కంపెనీలోని చాలామంది మళ్ళీ పార్వతీశాన్ని తలుచుకుని అతని మంచితనాన్ని మాటల్లో చెప్పుకున్నారు. పార్వతీశం స్టోర్స్ విభాగంలో పని చేసేవాడు. మనిషి నడివయస్కుడే అయినా కేన్సర్ కారణంగా ఏడాదిక్రితం మృత్యువాతపడ్డాడు.

ఒక ఉద్యోగి సర్వీసులో ఉంటూ చనిపోతే అతని కుటుంబం ఆర్థికంగా చితికిపోకుండా అర్హతనుబట్టి అతని సంతానానికిగాని భార్యకుగాని ఏదో ఒక ఉద్యోగం సానుభూతితో యిచ్చే ఆనవాయితీ కంపెనీలో ఉంది.

పార్వతీశం పోయిన్నాడు "అయ్యో" అన్నవారంతా నాలుగు రోజులు పోయాక ఆయన మాటే మరిచిపోయారు.

పార్వతీశం భార్య గౌతమికి ఉద్యోగానికి కావలసిన అర్హత లున్నా కంపెనీలో సరియైన ఉద్యోగాలు లేకపోవడంతో ఏడాది తరువాతనే ఆమెకు ఉద్యోగమిచ్చారు కంపెనీవారు.

అది తెలిసి చాలామంది సంతోషించారు. "పార్వతీశం మంచివాడు కాబటి అతని కుటుంబానికి న్యాయమే జరిగింద"నుకున్నారంతా.

అయితే ఎంతోమంది ఆనందించిన ఆ విషయానికి ఏ మాత్రం సంతోషించని వ్యక్తి ఒక దయానిధే!

ఆమెను తన ప్లానింగ్ యూనిట్‌లోనే పోస్ట్ చేశారని తెలియగానే దయానిధి మేనేజర్ రూమ్‌లోకి వెళ్ళి తన యూనిట్‌కి మనిషిని ఇవ్వలేకపోయినా పరవాలేదు కానీ స్త్రీలను మాత్రం పోస్టు చేయొద్దన్నాడు. కొన్ని పనులు స్త్రీలు చేయలేరనీ, మగవాళ్ళలా అవసరాన్ని

బట్టి రాత్రులు ఉండి పని చేయలేరనీనీ, సెలవులూ, పర్మిషన్‌లూ ఎక్కువ వాడుకుంటారనీ అతని అభిప్రాయం. ఆ విషయాన్ని మేనేజర్‌తో ఖచ్చితంగా చెప్పాడాయన. వీటికి తోడు అటువంటి వారివల్ల మొత్తం యూనిట్ డిసిప్లినే పాడవగలదన్న అనుమానాన్ని వ్యక్తం చేశాడు. దయానిధి చెప్పినది విని—

"చూడండి మిస్టర్ దయానిధీ! ప్రస్తుతం మీ యూనిట్‌లో తప్ప మరెక్కడా ఖాళీల్లేవు. కొన్నాళ్ళు చూడండి. తరువాత ఆమెను ట్రాన్స్‌ఫర్ చేయడానికి ట్రై చేస్తాను" అన్నాడాయన.

దయానిధి యిక మాట్లాడలేకపోయాడు.

ఆ మర్నాడే గౌతమి ఉద్యోగంలో చేరింది.

గౌతమికి ముప్పయ్ రెండేళ్ళుంటాయి– చామన ఛాయ, తీర్చి దిద్దినట్లుండే రెండు కనుబొమ్మల మధ్యా కనీకనిపించని తిలకంచుక్క. జీవితాన్ని తరచి చూసినట్లుండే నిశ్చలమైన చూపు; ఏ అలంకరణలూ, మెరుగులూ లేని సహజమైన ఆకర్షణతో వినయంగా వుండేది! తనకు కేటాయించిన పనిని చక్కగా చేసేది. అదికాక ఎవరేపని చెప్పినా కాదనకుండా చేసేది,

"ఫరవాలేదు– తను భయపడ్డంతగా లేవు పరిస్థితులు" అనుకున్నాడు దయానిధి.

కానీ మొదటి మూడు నెలలూ ఏ సెలవూ పెట్టని గౌతమి ఆ తరవాతనుంచి అడపా దడపా సెలవులు పెట్టడం మొదలుపెట్టింది. అలా ఆమె వర్క్ పెండింగ్‌లో పడిపోవడం మొదలైంది. ఒకట్రెండుమార్లు ఆమెను పిలిచి మందలించాడు దయానిధి. మరోమారు పర్మిషన్ అడిగితే ఇవ్వనని ఖచ్చితంగా చెప్పేశాడు. దయానిధి ప్రవర్తనకు గౌతమి చాలాసార్లు బాధపడింది. ఒకమారు కన్నీళ్ళు పెట్టుకుంది కూడా. ఆ సంఘటన తరవాత దయానిధి కాస్త మెత్తపడ్డాడు.

చనిపోయిన ఆమె భర్త పార్వతీశం దయానిధికి స్నేహితుడే. అతను బతికుండగా ఒకమారు వాళ్ళింటికి వెళ్ళాడు కూడా. ఆరోజు సంఘటనపై ఆఫీసులో నలుగురూ నాలుగు రకాలుగా అనుకున్నారు. తనలా ప్రవర్తించకుండా ఉండాల్సింది అనుకున్నాడు దయానిధి.

ఆ రాత్రి అతని అలోచనా సరళిలో మార్పు వచ్చింది. ఆ తరువాత గౌతమినెప్పుడూ అతను మందలించలేదు. సెలవులకూ, పర్మిషన్‌లకూ అడ్డు చెప్పనూలేదు. అతనిలోని ఆ మార్పుకు గౌతమితో పాటు మిగతా స్టాఫ్ కూడా ఆశ్చర్యపోయారు.

0 0 0

అంతవరకూ చెప్పి అగాడు దయానిధి. పగటి వెలుగు పూర్తిగా పోయింది. తూర్పున సముద్రం నుంచి వెండి బంతిలా చంద్రుడు పైకి లేస్తున్నాడు. ఆకాశంలో అక్కడక్కడా చుక్కలు వెలుగుతున్నాయి.

దయానిధి లేచి ప్లాస్కు తీసుకుని క్రిందికి వెళ్ళాడు.

అతని నోటంట ఆ కథ వినడం నాకు కొత్త అనుభూతి!

అయితే ఆ తరువాత జరిగిన కథ నాకు చూచాయగా తెలుసు. దయానిధి గౌతమిపట్ల చూపే సానుభూతికి వేరే అర్ధం కల్పించారు. వారిద్దరి మధ్యా గల సంబంధం గురించి నిప్పు లేకుండానే పొగ పుట్టించే ప్రయత్నాలు చేయసాగారు ఆఫీసులో.

"గురుడు ఇంటికి కూడా వెళ్తున్నాడట!" అని ఒకరంటే-

"వయసు ప్రభావం మరి! గాలి, నీరు, ఆహారం ఎంత ముఖ్యమో మనిషికి సెక్స్ కూడా అంతేమరి! ఎవరు మాత్రం ఎన్నాళ్ళని....?" అని మరొకరు- చిలవలు పలువలుగా పుకార్లు లేచాయి. వాటికి, దయానిధికి అకస్మాత్తుగా ఆమె పట్ల ఏర్పడ్డ జాలితో కూడిన అభిమానం ఒక కారణమైతే- వారిద్దరూ ఒంటరి జీవితం గడిపే స్త్రీ పురుషులు కావడం మరొక కారణమైంది.

ఒక జార్‌తో చల్లని నీళ్ళూ, రెండు గాజు గ్లాసులూ తెచ్చి టీపాయ్‌మీద పెట్టాడు దయానిధి.

చల్లని గాలి; లేత వెన్నెల- వాతావరణం ఆహ్లాదంగా ఉంది.

"మనిషిలోని పరివర్తనకు ఒక్కొక్కప్పుడు ఓ చిన్ని సంఘటన కూడా కారణం కావచ్చునేమో!" దయానిధి చెప్పడం మొదలు పెట్టాడు.

"గౌతమి కంటతడి పెట్టిన రోజు ఒకరిద్దరు నన్ను చాటుకు పిలిచి మందలించారు - అప్పటికి అధికారం తెచ్చిన డాబు ప్రదర్శించినా జీవితంలో ఏ ఒడుదుడుకులూ తెలియక వంటరి బ్రతుకు బ్రతుకుతున్న నేను విధి నిర్వహణ పేరుతో ఆమెను అవమానించి నొప్పించానేమో ననిపించింది.

ఆ మర్నాడు సాయంకాలమే ఆమె ఇంటికి వెళ్ళి క్షమాపణ చెప్పుకుని - ఆమెకు గల వ్యక్తిగత సమస్యలను కనుక్కోవాలని నిర్ణయించుకున్నాను.

ఏ ఆహ్వానమూ లేకుండా నేను వెళ్ళినందుకు కాబోలు నన్ను చూసి ఆశ్చర్యపోయింది గౌతమి. ఆమె ముఖ కవళికలను బట్టి బహుశా భయపడి వుండొచ్చునని కూడా అనిపించింది.

నే వెళ్ళేసరికి ఆ డాబా యింటి ముంగిట్లో రెండేళ్ళ బాబు నెత్తుకుని ఆడిస్తోంది గౌతమి-బేబీ ఫుడ్స్ డబ్బాల మీద ఉండే పసివాడిలా బొద్దుగా, ముద్దుగా ఉన్నాడు బాబు - నాక్కలిగిన ఆశ్చర్యం అంతా ఇంతా కాదు. ఆమెకో సంసారం; పిల్లలూ ఉంటారని ఇన్నాళ్ళూ నేనెందుకు ఊహించలేక పోయానో నాకే అర్థం కాలేదు.

అమృతం లాంటి ఆమె ఇచ్చిన కాఫీ తాగాక నా మనసులోని మాటను బయటపెట్టాను.

"మీ పట్ల నేను కఠినంగా వ్యవహరించినందుకు క్షమించండి. ఇకపై అటువంటిదేం జరగదని హామీ ఇస్తున్నాను."

తలెత్తి నా కళ్ళల్లోకి ఒక్క క్షణం చూసింది గౌతమి. ఆమె కళ్ళల్లో నీళ్ళు.

"మీ కభ్యంతరం లేకపోతే మీ సమస్యలేమిటో చెబితే సాటి మనిషిగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తాను" అన్నాను.

కాస్సేపు తటపటాయించింది. ఎక్కువ పరిచయమూ, స్నేహమూ ఉన్నవారితోనే స్వవిషయాలు చెప్పటానికి మనస్కరించదు. అటువంటిది - అంతకు పూర్వం ఆమె పట్ల కఠినంగా ప్రవర్తించిన నాతో తన విషయాలు చెబుతుందని నేననుకోలేదు - మరి ....ఏమనుకుందో .... నెమ్మదిగా తన పరిస్థితిని వివరించింది.

ఆ రెండేళ్ళ బాబు తప్ప ఆమెకు ఎవరూ లేనట్లేనట. భర్త పోయాక ఉన్న కొద్దిమంది బంధువులూ దూరమయ్యారు. ఆ నిస్సహాయ స్థితిలో కంపెనీ వారిచ్చిన ఉద్యోగమే ఆమె జీవికకు ఆధారమైంది - అయితే ఉద్యోగమొచ్చాక ఒక విధంగా ఆర్థికసమస్య తీరినా బాబు పెంపకం సమస్యగా మారింది. పగలు తను కంపెనీ నుంచి వచ్చే వరకూ బాబును చూసేందుకు ఎవరూ ఉండేవారు కాదు. పెద్ద పెద్ద పట్టణాల్లోలా చైల్డ్ కేర్ సెంటర్స్ లేకపోవడం వల్లా: పని పిల్లకే బాధ్యతంతా అప్పగించడం ఇష్టంలేకా ఇరుగు పొరుగు వారింటిలో బాబునొదిలి కంపెనీకొచ్చేది. పగలంతా ఆమె కనపడకపోవడంతో బాబు ఒక్కొక్కప్పుడు బెంగ పెట్టుకునేవాడు. అటువంటి తప్పని పరిస్థితుల్లోనే గౌతమి సెలవు పెట్టేది.

ఈ విషయాలామె చెబుతూంటే అప్పటిలో ఆమెపట్ల నేనెంత అమానుషంగా ప్రవర్తించినదీ నాకు తెలియవచ్చింది.

"ఈ సంగతి మీరు నా కప్పుడే చెప్పి వుండాల్సింది" అన్నాను అంతకంటే ఏమనాలో తెలియక.

అభిమానవతి అయిన స్త్రీ ఏ విషయాన్నీ పెదవి విప్పి చెప్పదు మరి!

క్రమంగా నా ప్రవర్తనలో మార్పు వచ్చింది. డబ్బు సంపాదించడానికీ, - అధికారం చెలాయించడానికీ మనం జీవించకూడదు. జీవితానికో అర్థం, పరమార్థం ఉండాలి అనిపించింది.

అంతకు ముందు నేను గౌతమి పట్ల కఠినంగా వ్యవహరించానని నన్ను మందలించిన వారే నేనామె పట్ల జాలి చూపితే లేనిపోని పుకార్లు లేవదీయడం మొదలుపెట్టారు. ఒక నిశ్చయమైన అభిప్రాయం ఉన్నవారు దేనికీ వెరవకూడదు - అందుకే నేనవేం పట్టించుకోలేదు.

అప్పుడప్పుడు గౌతమి ఇంటికి వెళ్ళి యోగక్షేమాలు కనుక్కోవడం అలవాటైంది. అలా ఆమెను గురించిన విషయాలు తెలిశాయి.

బ్రతుకు గడవని పరిస్థితి ఏర్పడబట్టిగాని లేకుంటే గౌతమికి ఉద్యోగం చేయడం సుతరామూ ఇష్టంలేదు. గృహిణిగా బిడ్డ పోషణ చూడ్డమే ఆమెకిష్టం. ఆమె అభిరుచులూ, సంస్కారమూ నన్ను క్రమంగా ఆకర్షించాయి. అడపాదడపా వెళ్తుండడం వల్ల బాబు నాకు బాగా చేరికయ్యాడు. నా కోసమే ఎదురు చూస్తున్న వాడిలా నవ్వి: నే వెళ్తే నన్ను పట్టుకునేవాడు. క్రమంగా నాతో ఆటలాడ్డం: షికార్లు చేయడం అలవాటు చేసుకున్నాడు. ఆ పసివాడి ఆనందంలో నేనూ పరవశించిపోయేవాడిని.

ఆ ఇంట్లో ఆ ఇద్దరి సమక్షంలో గంటలు క్షణాల్లా ఆనందంగా గడిచిపోయేవి. సంవత్సరాల తరబడి నాలో ఘనీభవించిన ఒంటరితనం క్రమంగా విచ్ఛిన్నమవసాగింది.

క్రమంగా నాలో కొత్త ఆలోచనలు చోటుచేసుకోనారంభించాయి. కలిసి బ్రతకడంలో ఎంతో ఆనందముంది. ఎన్నో సమస్యలకు పరిష్కారముంది. అయితే ఆ క్షణంలో నా అభిప్రాయాలను లోకం మెచ్చి హర్షిస్తుందా లేదా అనేది నేనాలోచించలేదు.

గౌతమి అంగీకరిస్తే చాలనుకున్నాను.

అందుకే ఓ అందమైన సాయంకాలం నా మనసులోని మాటను ఆమె ముందుంచాను. ఒక్క క్షణం నా కళ్ళలోకి చూసింది గౌతమి. ఏ భావమూ వ్యక్తం చేయని ఆ చూపును నే నెన్నటికీ మరిచిపోలేను. ఆ క్షణంలో బాబు నా భుజాల మీద కూర్చుని ఆడుతున్నాడు. ఆమె మౌనం నాలో ఎన్నోఅనుమానాలకు తావిచ్చింది. ఆశ్చర్యం ప్రకటించ లేదంటే నా నడవడికను బట్టి నా ఉద్దేశాన్ని ఆమె ముందుగానే గ్రహించిందా? మగాళ్ళంతా ఇంతేననుకుందా?....

"ఇది మీ పట్ల జాలిపడి ఏర్పరచుకున్న అభిప్రాయం కాదు. నాకు మీతో కలిసి జీవనం గడపాలని ఉంది" అన్నాను నెమ్మదిగా. నా నుండి బాబుని తీసుకుని మౌనంగానే లోపలికి వెళ్ళిపోయింది.

నిజానికి నేనామె స్థితిని చూసి జాలిపడలేదు. ఆ వయసులోని చాలామంది ఆడ పిల్లలు చదువుకుని ఉద్యోగాలు చేసుకుంటూ కూడా తండ్రో; అన్నో తనకు వరుణ్ని వెదికి వేలకొద్దీ రూపాయలు కట్నంగా గుమ్మరించి పెళ్ళి చేయాలని ఎదురు చూసే రోజుల్లో చిన్న వయసు లోనే భర్తను పోగొట్టుకొని బిడ్డతోపాటు యీ సంఘంలో బ్రతకడానికి సతమతమవుతోంది గౌతమి.

ఆమె చీకటి బతుక్కి దారి చూపి - ఆ దారినే వెన్నెల బాటగా చేసుకోవాలనుకున్నాను నేను- నాది స్వార్థపూరిత ఆలోచనే కావొచ్చు. కాని అత్యాస మాత్రం కాదు.

ఏమైతేనేం? ఇన్నాళ్ళకు గౌతమి అంగీకరించింది - అయితే ఇన్నాళ్ళుగా నాకు తెలియని నగ్న సత్యమొకదాన్ని నా ముందుంచి తన విలువను మరింత పెంచుకుంది గౌతమి.

ఆ బాబు గౌతమి బిడ్డకాదు! తల్లీ,తండ్రీ ప్రమాదంలో ఒకే మారు మరణిస్తే...దిక్కులేని ఆ బాబును...స్నేహితురాలి గారాల బిడ్డను....తన బిడ్డగానే పెంచాలనీ, ఆ బిడ్డకు ఎప్పటికీ తనే తల్లి

కావాలని ఆమె ఆశయం - ఆ పవిత్రాశయాన్ని మన్నించి కాపాడే బాధ్యతను నాపై ఉంచింది.

మీరు రచయితలు - క్రాంత దర్శకులు - మీ రచనల వల్ల ఎందరో ప్రభావితులై తమ మార్గాన్ని చక్కదిద్దుకుని ఉంటారు.

కానీ... నేను సగటు మనిషిని- నా అభిప్రాయాలూ-కోర్కెలూ నాకున్నాయి. అవి ఆమోద యోగ్యాలా కాదా అని నిర్ణయించ వలసింది మీ వంటివారే - నా నిర్ణయం ద్వారా రెండు జీవితాలకు వెలుగు చూపి నా జీవితానికో గమ్యాన్ని ఏర్పరచుకున్నాను. అంతకంటే ఒక సామాన్యుడిగా నేను చేయగలిగేదేముంది?"

అంటూ ఆగాడు దయానిధి—

నా ప్రతి అణువులోనూ ఆనందం !

దయానిధి మాటల్ని బట్టి గౌతమితో పాటు ఆమె చేరదీసిన బిడ్డను కూడా మనస్ఫూర్తిగా ప్రేమించగల ఆత్మధృతి అతనిలో వుందన్న విశ్వాసం కలిగింది.

కీర్తికోసమో, మరి దేనికోసమో రచనలు చేస్తూ గుప్పించే సిద్ధాంతాలకూ, అనుసరించే మార్గాలకూ పొంతన లేకుండా జనాన్ని పెడదోవ పట్టించే కొంతమంది రచయితలముందు దయానిధి ఆ క్షణములో మేరు పర్వతంలా అనిపించాడు.

ఒక గొప్ప సంస్కర్తగా కనిపించాడు నా కళ్ళకి.